అశ్వహృదయం

శ్రీ భారతీప్రియ

ఒకర్నొకరు ఎగాదిగా చూసుకొన్నారు.

గురుతు చిక్కినట్టు తోచలేదు.

అయినా ఎక్కడో చూచినట్టు మసక మసకగా జ్ఞాపకం; మనస్సులోని లోతులలో సన్నని గుసగుస.

స్మృతి గతి కాలపు మబ్బులలో దోబూచు లాడుతున్నది.

మొదట మాట్లాడింది వాడే.

"మనం ఎక్కడో కలుసుకున్నట్టు జ్ఞాపకం."

"నాకూ అలాగే తోస్తుంది."

"ఎక్కడై ఉండవచ్చు?"

"సరిగా గుర్తులేదు; నేనూ అదే ఆలోచిస్తున్నాను."

"నీవు కొల్హాపురంలో ఉన్నావా?"

"ఔను. ఉన్నాను. బహుశా అక్కడే మనం ఒకర్నొకరం చూచుకొని ఉంటాము."

"ఉండవచ్చు. కొల్హాపురంలో రాజా సుఖీరామ్ తెలుసా?"

"ఓహో! చాలా బాగా తెలుసు. నేను వాళ్ల ఇంట్లోనే ఆరునెలలున్నాను."

"నేను నిన్ను అక్కడే చూశానేమో!" "అదే అయి ఉంటుంది; నాకూ అలాగే తోస్తుంది."

"నీవు పూనా వచ్చి ఎన్ని రోజులయింది?"

"సుమారు మూణ్నెల్లు."

"మూణ్నెల్లా! అప్పటినుంచీ ఎక్కడా కనిపించనేలేదే?"

"నేను అంతగా వెలుపలికి వెళ్లడంలేదు. ఇది నాకు కొత్త చోటు. ఇటీవల వెలుపలికి వస్తున్నాను. అంతేకాక కొంచెం తర్ఫీదు కూడ పొందుతున్నాను."

"మంచిపనే. బస ఎక్కడ?"

"నానాసాహెబ్ గారి యింట్లో."

"నానాసాహెబా?"

"ఔను; ఎందుకలా అలా అడుగుతున్నావు? నీకు ఆయన పరిచయమా?"

"ఆయన నా యజమాని దాయాది."

"మీ యజమాని ఎవరు?"

"కాకాసాహెబ్. నీకు తెలుసా?"

"విన్నాను. వారికీ, వారికీ చాలా ద్వేషమట."

"ఉండవచ్చు: కాని, దానికీ మనకూ ఏమీ సంబంధం లేదుకదా!"

"ఏమీ లేదు."

"నిన్ను మళ్లీ చూడడం నాకు చాల సంతోషమైంది."

"నాకూ అంతే."

కొననాలుక మాటకాదు; నిజంగా హృదయంనుంచి వచ్చిన మాట అని మనస్సుకు తట్టింది. అలాగే ఒక క్షణం తన కొత్త స్నేహితురాలిని తేరిపార చూచాడు. వెన్నవంటి సున్నని దేహం; దానికి అనుగుణమైన నడనడ; ముద్దైనముఖం; కళ్లల్లో ఇంకా లేతదనపు కాంతి; గంభీరమైన నిలవరం; ఆ రూపుకు మైకావలిగా లజ్జ. ఒక్కసారిచూస్తే వెన్నెలవంటి ఆ చెలువాన్ని వదలి మరొకవైపు చూపు మరల్చడానికి మనస్సురాదు.

కొత్తవెలిమి చల్లని వెలుగులో ఇద్దరూ క్షణకాలం మౌనంగా ఉన్నారు.

నౌకర్లు వచ్చి ఒక్కటిగా నిలబడి ఉన్న గుర్రాలు రెంటినీ విడివిడిగా తీసుకొని వెళ్ళారు.

దేహం దూరమైతేనేమి! మనస్సు దగ్గరకు వచ్చింది.

2

ఒకదాని పేరు రాజ, మరొకదాని పేరు రాణి. వాటి యజమానులూ నౌకర్లూ ప్రీతితోను, సులువుకోసమూ పిలిచే పేర్లివి. అయితే వాస్తవమైన లోకానికి తెలిసిన పేర్లు వేరే. ఒకటి "ప్లేయింగ్ ప్రిన్స్", మరొకటి "డెక్కన్ క్వీన్". రెండూ పేరు ప్రఖ్యాతి పొందిన పందెం గుర్రాలు. రాజా భారీ భారీ పందేల్లో గెలిచి కీర్తి శిఖరాన్ని ఎక్కింది. దానిని కొని, సాకి, తర్ఫీదు ఇవ్వడానికి కాకాసాహెబ్ లక్షాంతరంగా డబ్బు వెచ్చించాడు.

రాణి ఇటీవలకే కీర్తికాంతిలోకి వచ్చింది. ఇంకా లేతవయస్సు. చూడడానికి సౌమ్యంగాను, సుందరంగాను కనిపించినా, రేస్ కోర్సులో దాని చలాకీని చూచి పెక్కుమంది వెరగుపడిపోయారు.

దాని వేగం, చురుకుతనం, అణకువ చూచి కాకాసాహెబ్ కు లోలోపలే కడుపు రగులుతూ ఉంది. తన దాయాది ఇలాంటిసొగసైన గుర్రం సంపాదించాడుకదా అని ఒకవైపు అసూయ; తన రాజాతో పోటీకి ఇంకొకటి వచ్చిందికదా అని మరొకవైపు మంట. ఈ యోచన రాత్రీ పగలూ అతని మెదడును తినివేసేది. నానాసాహెబ్ కూ అలాగే నానాటికి పెరుగుతున్న రాజాకీర్తి చూచి దాయాదిపై ద్వేషం ఇనుమడించింది; లోపల మాత్సర్యం ముమ్మరం కాసాగింది.

రెండుగుర్రాలూ రేస్ కోర్సులోను, క్లబ్ దగ్గరా అప్పుడప్పుడు భేటీ అవుతూ వుండేవి. అపురూపమైనా మావగాని ఈ పరస్పర సందర్శన సామీప్యాలవల్ల అవి చాల సంతోషపడ్డాయి. ఒకదాని చూపు మరొకదాని చూపుతో అకస్మాత్తుగా మెరుపులాగ కలిసినప్పుడు రెండిటి ఒళ్ళూ జలదరించేది; ఒకదాని ఒళ్ళు మరొకదానికి అనిరీక్షితంగా తాకినప్పుడు వెంటనే ప్రపంచమే మరపువచ్చేది; హర్షం వర్షంగా కురిసేది; కొత్త ప్రపంచమే కళ్ళముందు కలకల నాట్యమాడేది. నవలెత్తిన ఈ స్నేహం రెండింటి జీవితంలో కమ్మని తావులను కమ్మజేసింది. నూతన విలాసం సంతరించింది.

3

పందెంరోజు సమీపించింది. రెండు గుర్రాల మీదా పందెగాళ్ళు భారీగా పందెం ఒడ్డారు. రెండిటికీ బాగా తర్ఫీదు ఇచ్చేవారు. రాజా గెలిస్తే ఒక ఆస్తి తనకు లభిస్తుందని కాకాసాహెబ్ ఆలోచిస్తే, రాణి గెలిస్తే తనకొక లిబ్బే దొరుకుతుందని నానాసాహెబ్ మనస్సులోనే 'మండిగలు' వండు కొంటున్నాడు. జూదగాళ్ళ స్వభావానుసారంగా పందెం రోజు సమీపించిన కొద్దీ కాకా, నానా మహోత్సాహోద్వేగాలతో త్రుళ్ళిపడుతున్నారు.

ఒకరోజు రేస్‌కోర్సులో రాజా, రాణి అకస్మాత్తుగా కలుసుకొన్నప్పుడు ప్రసంగవశాత్తు ఈమాట వచ్చింది. ఈమాట ఎత్తడం ఔచిత్యం కాదేమోనని రెండు శంకిస్తూ ఇన్నాళ్ళూ ఊరకే ఉన్నాయి. కాని ఈసారి ఊరుకోక రాజాయే మాట మొదలు పెట్టింది.

"పందెం అంటే ఈ జనం తల ఎలా చెడిపోతుందో చూచావా ?"

రాణి జవాబు చెప్పక ఊరకే ఊగొట్టింది.

"పైసలు, పేరు, పట్టుదలా - ఇవే ముఖ్యమా ?"

"మనుష్యులలో అంతేనని తోస్తుంది."

"దానికంటె మిగిలిందీ, ముఖ్యమైందీ లేదా ?"

"ఉంది - స్వార్థం !"

"చక్కగా అన్నావు; దానిలోనూ ఎంత పైపోటీ !"

"అది ఆరురాశి, స్వార్థాల సంతు."

"నిజం; అన్నట్టు, హెచ్చుతగ్గుల గుద్దులాట చూచావుకదూ?"

"అది వారికే తగును."

"అందుకోసమే మనకీ త్రిప్పట కావాలి! మనం వారి ఆశలు ఈడేర్చే సాధనాలు మాత్రమే."

"ఔను; కావలసినప్పుడు మనమీద బియ్యార్ల రూపాయలు కురిపిస్తారు. కానప్పుడు, మనం కొంచెం ఉపయోగపడక పోయామా గడ్డిపోచకంటే కడా. మన కర్మ.

"కర్మ! అదేలాటి కర్మ? దాన్ని చూస్తే ఒళ్లు చిటచిట లాడుతుంది."

"అయినా గత్యంతరం లేదుకదా?"

"ఔను; ఈ తలక్రిందుల సృష్టి సరిగ్గా అయ్యేవరకూ మరొక ఉపాయమూ లేదు; ఉపశమనమూ లేదు. అంతవరకూ..."

మాట అంతటితో ఆగిపోయింది. యథాప్రకారం నౌకర్లువచ్చి, ఒంటికి ఒళ్ళు తాకించి, మూతిపై మూతి ఆడిస్తూ నిలబడిన గుర్రాలను విడదీసి తోలుకొని వెళ్ళారు.

4

మర్నాడు పందేలు. సాహెబ్ సొగసులకు ఎక్కడాలేని తమకం; మనస్సులో కసమసం; ఎప్పుడా ఎప్పుడా అని తటపట లాడే గుండె. తామే లాయాలకువెళ్ళి తమ గుర్రాల వీపు దరచి మాటలతో ఉత్సాహపరిచారు. నౌకర్లు గుర్రాలకు మంచి దాణా వేసి, బాగా మాలిష్‌చేసి జీను తగిలించి తయారుచేశారు.

సాయంకాలం నాలుగు గంటలకు పందేలు ప్రారంభమయాయి. రేస్‌కోర్సులో కాలుపెట్టడానికే సందులేని జనం కిటకిట. నేటి పందెంలో రాజా, రాణి పరుగెత్తుతాయనే సంగతంతా అందరికీ సంతోషోత్సాహాలు కలిగించింది. వాటి పరుగును చూడడానికి వేలాదిగా జనం వచ్చారు. ముందున్న స్థానాలలో అప్పుడే ఒకవైపు నానా, మరొకవైపు కాకా తమ తమ పరివారంతో కూచున్నారు. రేస్‌కోర్సు అంతటా వ్యాపించిన జనం కోలాహలం నేటి ఉత్సాహానికీ, నిరీక్షణకూ దర్పణమైంది.

ఏడెనిమిది పేరుమోసిన గుర్రాలు పందెంలో దిగాయి. విశాలంగాను, వృత్తాకారంగాను ఉన్న ఆ మైదానంలో ఎక్కడ చూచినా జనమే, ఎక్కడ విన్నా గుర్రాల గొడవే. పందెం వేడి జనానికి అప్పుడే సగం ఎక్కింది. పరుగెత్తుతున్న గుర్రాలను అంటిపెట్టుకొనే ఉంది జనం చూపు. మధ్య మధ్య గుర్రాల సకలింపులు; సమగతిలో లయబద్ధంగా వినిపిస్తున్న గిట్టల ధ్వని; అశ్వహృదయాన్ని ఆకళించుకున్న జాకీల హెచ్చరింపుల ధ్వని; జనసమ్మర్దపు ఒకే గొంతుకల పొలికేకలు—వాతావరణాన్ని వేడెక్కించాయి. ఆయా గుర్రాల యజమానులూ, వాటిపైన పందెం కట్టినవారూ అప్పుడప్పుడు లేచి నిలబడుతూ తమ గుర్రాలను పేర్లతో పిలుస్తూ ప్రోత్సాహిస్తున్నారు.

నిమిష నిమిషానికీ వేగం హెచ్చిస్తూ ముందు పరిగెత్తుతున్న రాజా జనుల ఈ ఆనంద కోలాహలాన్ని గుర్తించకపోలేదు. కాని, మరొకవైపు దృష్టిపెట్టే పురసత్తు దానికేది? తన లక్ష్యం సాధించి కృతకృత్యం కావడానికి అది తక్కిన గుర్రాలన్నిటినీ ఒక్కొక్కటిగా వెనక్కు వేస్తూ ముందుకు సాగిపోతున్నది. దాని ఈ పరుగు పెరుగుతూ పోయినకొద్దీ రకరకాల కేకలన్నీ ఒక్కటే అవుతూ వచ్చాయి. "రాజా! రాజా!" అని అందరూ కేకలు వేయసాగారు. రాజా అన్ని గుర్రాలకన్నా ముందుగా వచ్చే సూచన స్పష్టమవుతూ ఉంది.

రాజా మనస్సు తన లక్ష్యంమీదే కేంద్రీకృతమైంది; జన సందోహంలో అగ్గలమైన కేకలు దానిచెవిలో ఏమీ పడడం లేదు. దానిపై స్వారీఅయిన, జాణ అయిన జాకీ మాటలతో హుషారిస్తున్నాడు. ఒళ్ళు గాలిలో తేలిపోతున్నది; వేగం క్షణక్షణానికీ ఎక్కువవుతూ ఉంది; ఎగఊపిరి, దిగఊపిరి; ముకుపుటాల్లోను, నోట్లోను నురుగులు కురుస్తున్నాయి; మనస్సు ఏకాగ్రమైంది. ఎప్పుడూ కనివిని ఎరుగని, అనన్యదృశ్యమైన రాజా తలసచమత్కృతిని చూచి జనం పెద్దపెట్టున జయఘోష పెట్టింది.

ఈ స్థితిలో ఉన్నదున్నట్టుగానే రాజా మనస్సు కించిత్తు సడలి పక్కకు పారింది. పక్కన ఎవరో వచ్చినట్టు తోచింది. పరిచితమైన ఆ గిట్టల చప్పుడు ఎవరిది? ఎవరిది ఆ అలవాటయిన ఆమేని వాసన? రాజా చిత్తం ఒక్కక్షణంలో చెదిరిపోయింది. జాకీ హెచ్చరికనుగూడా అది లక్ష్యపెట్టక మెరుపు మెరిసినంత కాలంమాత్రం అది పక్కకు చూపు సారించింది.

రాణి! తను ఊహించినట్టుగానే రాణి! ఇంకెవరికి సాధ్యం ఈ చమత్కారమైన పరుగు; ఈ గంభీరమైన పదాఘాతం; ఈ మృదుచపలగతి? రాణి సరాసరి తనపక్కకే వచ్చివేసింది; తనవైపే చూస్తున్నది.

ఒక్కక్షణం రెండిటి చూపూ చేరింది.

ఎంత ఉత్సాహపడుతున్నది ఈ పరుగులో రాణి! అయితే, తనవేగంముందు దానివేగమా? తన పరుగుకు దాని పరుగు సాటా? తన గెలిపి దానికుందా? తాను గెలిచి రాణి ఓడిపోతే? ఎలాంటి ఆలోచన! ఎంత స్వార్థం! ప్రేమ స్వార్థరహితం కదా? అయితే కర్తవ్యం? ఏది గొప్పది - ప్రేమా? కర్తవ్యమా? తన జీవనసఖికి పరాజయమా? ఈ పరాభవాన్ని అది సహించగలదా? సహించినా, సహించవచ్చు. అయితే, నేను సహించడం ఎలాగా? దాని ఓటమి తన—ఓటమి; దాని పరాభవం తన ఆత్మకు అవసానం...కాదా? ఈ కర్తవ్యానికి ప్రేమను బలిపెట్టాలా? రాణి దీనదృష్టి మనస్సును కరిగించేట్టు ఉందికదా? తనవల్ల గాదు...కాని, కర్తవ్య లోపం అయితే? స్వామిద్రోహమైతే? కర్తవ్యం...ప్రేమ...

మనస్సు ఈ సందిగ్ధావస్థలో ఒక్కక్షణంలో చిక్కుకొని తికమక అయింది; గుండె దిటవు చెడిపోయింది. పరుగులోని వడి సడలి మనస్సు ఈ కలవరంలో కొట్టుకుంటున్నప్పుడు శరీరం తన కర్తవ్య నిర్వహణంలో కొద్దిగా లోపంచేసింది; పట్టు తప్పింది; కుడికాలు కుసిపడింది. దానినుంచి మెలకువతో తప్పించుకొనే శక్తి తనకు ఉండీ లేనట్టు, రాజా, ఆ జనసముద్రపు మహాకోలాహలంలో, తన పైని జాకీతోసహా దభీమని నేలపై పడి పొర్లి, స్పృహ తప్పిపోయింది.

లక్ష్యం చేరడానికి ఇక నాల్గే బారలదూరం ఉంది.

5

గెలిచిన సంతోషం రాణికి కొంచెం కూడా లేదు. రాజాకు కలగవలసిన గెలుపు తనకు కలుగడం దానికి సంతోషం కలిగించలేదు; ఇబ్బందిగా సిగ్గు కలిగించింది. తనకోసమే రాజా ఈ కీర్తి వదులుకొందని రాణికి పూర్తిగా మనసుకు తెలిసిపోయింది. ఈ తెలివిడి దాన్ని కత్తులు, కటార్లతో పొడిచినట్టయింది.

రేస్‌కోర్సునుంచి చాలమంది వెళ్ళిపోయారు. అక్కడా అక్కడా కొంతమంది తిరుగాడుతున్నారు. కొంచెంసేపు ముందు జనసమూహంతో కిటకిటలాడుతున్న మైదానం ఇప్పుడు పట్టి బీడుగా కనిపిస్తున్నది. పందెంలో పరిగెత్తిన గుర్రాలన్నీ రేస్ కోర్సు ఆవరణంలో విడివిడిగా గుడారాల్లో విశ్రాంతి తీసుకుంటున్నాయి. పందెంలో గెలిచిన రాణి కూడా వాటిలో ఉంది. దానికి చాల ఉపచారాలు జరుగుతూ ఉన్నవి. నానాసాహెబే ఖుద్దున వచ్చి, దానిని మెచ్చుకొని ముద్దుపెట్టుకొని వెళ్ళాడు. ఇద్దరు నౌకర్లు దానికి మాలిష్ చేస్తున్నారు. ఒకడు దాణాపట్టుకొని ముందు నిలబడ్డాడు. కాని, రాణికి కొంచెం కూడా ఈవైపు దృష్టి లేదు. దాని మనస్సులో ప్రతిధ్వనిస్తున్నది ఒకే ప్రశ్న: రాజా ఎక్కడ? దానికి ఏమయింది? రాజా ఎందుకు కనిపించదు?—దానికి దెబ్బతగిలి ఉంటుందని, బహుశా చికిత్స జరుగుతూ ఉండవచ్చునని రాణి ఊహించింది. ఆ ఊహ దాని మనస్సులో తాళలేని తల్లడం కలిగించింది; సహించలేని వేదన కలిగించింది. కళ్ళు మూసని దానిని మనస్సు తెలుసుకొనేట్టు-రాణి మనస్సు ఉద్విగ్నమై మూక వేదనకు పాల్పడింది. వద్దన్నా, దాని హృదయాన్ని అమంగళపు నీలినీడలు మూగసాగాయి.

రాణి హృదయంలో ఈ చెడుయోచనలు ముసురుకొన్నప్పుడే ఆ ధ్వని వినిపించింది:

ఒకటి—రెండు—మూడు!

మూడుసార్లు తుపాకి గుండ్లు పేల్చిన ధ్వని!

రాణి గుండెకు ఆ గుండ్ల దెబ్బ తగిలినట్టయింది. ఒళ్ళంతా భయం మెరుపులాగ పాకింది; ఎక్కడలేని ఆవేగంతో దాని దేహం వణకసాగింది. తెలివితెప్పి, కట్టుకొయ్యలను యమసాహసంతో తెంచుకొని, చెంగున ఎగిరి గుడారంనుంచి ఒక్క ఉరుకుతో వెలుపలికి వచ్చిపడింది.

ఆ ఉగ్రమూర్తిని చూచి జనం అదిరిపడింది. దానిని పట్టుకొనడానికి ఎవరికీ సాధ్యం కాలేదు. రాణి పసికట్టి సుమారు ఫర్లాంగు దూరంలో ఉన్న ఒక గుడారంవైపు ప్లుతగతితో—నాలుగు కాళ్ళూ గాలిలో వేస్తూ పరిగెత్తింది. భయాశ్చర్య చకితులైన జనం "హో!" అని కేకలు వేస్తూ దాని వెంటనే పరుగున వచ్చారు. విల్లునుంచి వెడలిన బాణంలా రాణి ఉరకలు వేసుకుంటూ వచ్చి ఒక్క నిమిషంలో ఆ గుడారంలో జొరబడింది. జొరబడి అక్కడి దృశ్యం చూచి స్తంభించిపోయి వాకిట్లోనే నిలబడింది.

రాజా నేలమీద అస్తవ్యస్తంగా ఎగఊపిరులతో పడిఉంది; పడిన గాయంనుంచీ, గుండ్ల దెబ్బలనుంచీ ఒళ్లంతా రక్తంతో తడిసింది; కళ్ళ గుడ్లు తేలిపోతున్నాయి; నోట్లో నురగ కట్టింది; చెమట ఓడికలై పారింది; మెడ వాలిపోయింది; పక్కనే ఇద్దరు తుపాకులు పట్టుకొని నిలబడి ఉన్నారు; వారి తుపాకుల గొట్టాలనుంచి కమ్మిన పొగకూడా ఇంకా చెదరిపోలేదు.

రాణి ఈ దృశ్యం చూచి సహించలేక గుండె పగిలి రాజా పక్కన కుప్పగా కూలిపోయింది. కళ్ళనుంచి నీరు కాలువకట్టింది. గుండె వేడి వెలుపలికి కమ్మింది.

"రాజా, నా రాజా!

రాజా కష్టమ్మీద తలయెత్తి చూచింది.

"రాణీ, వచ్చావా, నా బంగారం!"

"వచ్చాను, నా వలపా; నీకు చావు తెచ్చాను."

"వద్దు నా బంగారుకొండా; అలా అనవద్దు."

"అయ్యో! ఎంతటి పని అయిపోయింది. నే నెంత పాపిని? నేనే నీ మరణానికి కారణమయ్యానే. దీనిని ఎలా సహించను రాజా?"

"సహించు రాణీ, దుఃఖపడవద్దు; అయిందానికి ఏడు పెందుకు? ఇలాటి చావు చావా? నీ కోసం ఇలాటి వెయిచావులు చావడానికి సిద్ధమే!"

"నీ ప్రేమతో నా ఆత్మ పునీతమైంది. కాని, నా రాజా నీవు లేనిదే నా జీవితం బీడయిపోయింది."

"మళ్ళా అక్కడ చేరేవరకూ అంతే. నీ కోసం కాచుకొని ఉంటాను; అంతవరకూ నన్ను మాత్రం మరువవద్దు."

కళ్ళల్లో త్యాగపు దివ్యజ్యోతి మెరిసింది. తన సర్వశక్తులూ కూడగట్టుకొని కళ్ళను పెద్దగా విప్పి ఆఖరుసారి మనసారా రాణిని చూచింది. ఎత్తిన మెడవాలి పక్కనఉన్న రాణి మెడపై పడిపోయింది.

క్షణభంగురమైన నొప్పితో బాధపడి, చిరనూతనమైన వలపుతో వలిగిన ఆ జీవం ఈ లోకం వదలిపెట్టింది. రాణి మాత్రం అక్కడినుంచి లేవక ధారాపాతంగా కన్నీరు కురిపిస్తూ ఏడుస్తూనే ఉంది.

అక్కడున్నవా రెవరూ ఉన్న స్థలంనుంచి కదలలేదు; ఎవరూ నోరు విప్పి పలుకలేదు; ఎవరికీ ఏమీ బోధపడలేదు.

('త్యాగ' అనే కన్నడ కథకు అనువాదం)